www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 20 సెప్టెంబరు 2024

5

పశ్చిమ గోదావరి

స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యంతో..

అధికారులు ప్రణాళికలు రూపొందించాలి

రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్

భీమవరం : స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేసేందుకు కృషి చేయాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ అన్నారు. గురువారం చీఫ్ సెక్రటరీ విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, డిఆర్‌ఒ పాల్గొన్నారు. చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ జిల్లాల్లో స్వర్ణాంధ్ర జిల్లా విజన్ ప్లాన్ అక్టోబర్ 15వ తేదీ నాటికి రూపొందించాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా మండలస్థాయిలో ప్రణాళికలు రూపొందించి నివేదిక పంపాలన్నారు. ఈ క్రమంలో స్వర్ణాంధ్ర కోసం రానున్న ఐదేళ్లకు వార్షిక ప్రణాళిక రూపొందించాలన్నారు. ఏటేటా ఏంటో వార్షిక ప్రణాళికలో పొందుపరుస్తూ డాక్యుమెంటరీ సిద్ధం చేయాలన్నారు.

స్వీపర్లపై చిన్న చూపు..!

ఏలూరు కలెక్టరేట్ వద్ద జీతాల కోసం ఆందోళన చేస్తున్న స్వీపర్లు (ఫైల్‌ఫోటో)

స్కూల్ స్వీపర్లకు ఆరు నెలలుగా అందని జీతాలు

రెండు జిల్లాల్లో మూడు వేల మందికిపైగా ఆయాలు

దాదాపు రూ.పది కోట్ల మేర జీతాల బకాయి

ఉదయ నుంచి సాయంత్రం వరకూ పనిచేస్తే

ఇచ్చేది రూ.ఆరు వేలే

ఆ కొద్దిపాటి జీతమూ సకాలంలో ఇవ్వని దుస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వ స్కూళ్లలో పని చేసే ఆయాల(స్వీపర్ల)ను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. రోజంతా పనిచేస్తే కనీస వేతనం ఇవ్వని పరిస్థితి ఓవక్క, ఇచ్చే కొద్దిపాటి వేతనమూ సకాలంలో ఇవ్వని పరిస్థితి మరోవక్క నెలకొంది. స్కూళ్లలోని ఆయాలకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. దీంతో తమకు వేతనాలు చెల్లించాలని మహాప్రభో అంటూ ఆయాలు ఆందోళన బాటపట్టిన పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో 1,866 మంది ఆయాలు పని చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదేస్థాయిలో ఆయాలు పని చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు మూడు వేల మందికిపైగా ఉన్న ఆయాలకు గడిచిన ఆరు నెలలుగా వేతనాలను ప్రభుత్వం ఇవ్వడం లేదు. మూడొందల మంది విద్యార్థులకు ఒకరు చొప్పున స్కూళ్లలో ఆయాలు పని చేస్తారు. ఉదయం ఎనిమిది గంటలకు స్కూల్‌కు వస్తారు. మరుగుదొడ్లు శుభ్రం చేసి స్కూల్ గదులన్నీ శుభ్రం చేయాలి. రోజుకు కనీసంగా నాలుగుసార్లు మరుగుదొడ్లలను శుభ్రం చేస్తారు. సాయంత్రం వరకూ స్కూళ్లలోనే ఉంటారు. అటెండర్లు లేని స్కూళ్లలో ఆయాలతోనే ఆ పనీ చేయిస్తున్న పరిస్థితి ఉంది. వీరికి నెలకు ఇచ్చే వేతనం రూ.ఆరు వేలు మాత్రమే. ఆదివారం మినహా ఎటువంటి సెలవులూ ఉండవు. ఏప్రిల్, మే నెలల్లో సగం జీతమే ఇస్తారు. రోజంతా కష్టపడుతున్నా ప్రభుత్వం ఇచ్చే వేతనం రోజుకు రూ.200 మాత్రమే. ఆయాలు ఒక్కరోజు సెలవు పెట్టినా మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా మారుతోంది. స్కూల్ నిర్వహణలోనూ ఆయాలు కీలకపాత్ర పోషిస్తున్నారు. వీరు లేకపోతే మరుగుదొడ్లు శుభ్రం చేసేవారే ఉండరు. స్కూళ్లలో అనారోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితి ఏర్పడనుంది. ముఖ్యమైన పారిశుధ్య పనులు చేస్తున్న ఆయాల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. మార్చి 22న వీరికి వేతనాలు జమ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మళ్లీ వేతనాలు ఇవ్వలేదు. ఒక్క ఏలూరు జిల్లాలోనే దాదాపు రూ.ఐదు కోట్ల మేర బకాయి ఉంది. రెండు జిల్లాల్లో రూ.పది కోట్ల వరకూ ఆయాలకు వేతనాల బకాయి ఉంది. తమకు వేతనాలు వెంటనే జమ చేయాలని కొద్దిరోజులుగా ఆయాలు అనేక ఆందోళనలు నిర్వహిస్తూ అధికారులను కలుస్తున్నారు. అదిగో..ఇదిగో అనడం మినహా వేతనాలు మాత్రం జమకావడం లేదు. దీంతో ఆయాల కుటుంబాలు ఆర్థికంగా నలిగిపోతున్నాయి. ఒకొక్కరికి రూ.36 వేలు వరకూ రావాల్సి ఉంది. నిరుపేద కుటుంబాలకు చెందిన ఆయాలకు ఇది చాలా పెద్దమొత్తమని చెప్పొచ్చు. ప్రభుత్వం వెంటనే ఆయాలకు వేతనాలు చెల్లించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

స్వీపర్లకు అత్యంత దారుణంగా వేతనాలు

ప్రభుత్వ స్కూళ్లలో పని చేసే ఆయాలకు జీతాలు అత్యంత దారుణంగా ఇస్తున్నారు. మరుగుదొడ్లను శుభ్రం చేయడం అనేది చాలా కష్టమైన పని. ఈ పనికి త్వరగా ఎవరూ ముందుకు రారు. సేవాభావంతో వస్తున్న వారికి కనీస వేతనం కూడా ఇవ్వడం లేదు. వ్యవసాయ పనులకు వెళ్తే నాలుగైదు గంటల్లోనే రూ.ఐదు వందల కూలి వస్తోంది. ఆయాలకు మాత్రం రోజంతా పని చేసినా రోజుకు రూ.200 మాత్రమే ఇస్తున్న పరిస్థితి ఉంది. వీళ్లులేకపోతే స్కూళ్లలో మరుగుదొడ్ల పరిస్థితి ఏమిటో ఆలోచించడానికే భయం పుడుతోంది. గత ప్రభుత్వం అమ్మఒడి సొమ్ములో ప్రతి విద్యార్థి నుంచి రూ.రెండు వేలు తీసుకుని ఆయాలకు జీతాలుగా ఇచ్చేది. ఈ ప్రభుత్వం ఆయాలకు జీతాలు ఏవిధంగా చెల్లిస్తుందో వేచిచూడాలి. కూటమి ప్రభుత్వం ఆయాల జీతాల పట్ల పునరాలోచించాలని వారంతా కోరుతున్నారు. కనీస వేతనం అందించేలా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం..

దుర్గ, స్కూల్ ఆయా, ఏలూరు

మార్చి 22 తర్వాత ఇప్పటి వరకూ జీతాలు అందలేదు. అధికారులను అనేకసార్లు కలిశాం. రెండు రోజుల్లో జమవుతాయని చెబుతున్నారే తప్ప జమ కావడం లేదు. జీతాలు అందక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే జీతాలు జమ చేయాలని కోరుతున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పని చేస్తే రూ.ఆరు వేలు వేతనం ఇస్తున్నారు. వేతనాలు పెంచాలని కోరుతున్నాం.

ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే ఎలా

అనంతలక్ష్మి, స్వీపర్, ఉంగుటూరు మండలం

ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కుటుంబం ఎలా బతకాలి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పని చేస్తున్నాం. ఇచ్చే కొద్దిపాటి జీతం సకాలంలో ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే జీతాలు విడుదల చేయాలి.

ఈ రోజో.. రేపో జమ కావడం ఖాయం

అబ్రహం, డిఇఒ, ఏలూరు

స్కూల్ ఆయాల వేతనాలకు సంబంధించిన ప్రక్రియ అంతా మూడురోజుల క్రితమే పూర్తి చేసి ట్రెజరీకి పంపించాం. ఈ రోజు..లేకపోతే రేపో వేతనాలు జమవుతాయి. ఆగస్టు వరకూ పెండింగ్ వేతనాలు ఇవ్వడం జరుగుతోంది. ఆయాలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు.

సైకిల్ ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి, ఎంఎల్ఎలు

పర్యావరణ హిత వాతావరణానికి కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పర్యావరణ హిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం విష్ణు కళాశాల నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, భీమవరం, ఉండి ఎంఎల్ఎలు పుట్టపర్తి రామాంజనేయులు, కనుమూరి రఘు రామకృష్ణంరాజు పాల్గొన్నారు. తొలుత సైకిల్ ర్యాలీని ఎంఎల్ఎ రామాంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. విష్ణు కళాశాల మెయిన్ గేట్ నుంచి బివి.రాజు సర్కిల్ వరకూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ హిత వాతావరణాన్ని నెలకొల్పే ఆలోచన కలుగజేసేందుకే సైకిల్ ర్యాలీని చేపట్టినట్లు తెలిపారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు, యువత చిన్నతనం నుండే మంచి అలవాట్లు నేర్చుకోవాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోగలమన్నారు. ఎంఎల్ఎలు అంజిబాబు, రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ఎవరికి వారు బాధ్యత వహించాలన్నారు. రోడ్లపై చెత్త, ఉమ్మి వేయరాదన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నోడల్ అధికారి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి బివి.నాగేశ్వరరావు, భీమవరం డిఎస్‌పి ఆర్‌జి జై సూర్య, విష్ణు కాలేజ్ ప్రిన్సిపల్ ఐఆర్.కృష్ణంరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు

పార్టీకి సంబంధంలేని వ్యక్తుల పెత్తనంతో..

వైసిపి ఘోర పరాజయం

జగన్ ఇచ్చిన రూ.30 కోట్లు నొక్కేశారు

ఇక నుంచి ప్రశ్నిస్తా.. నిలదీస్తా..

మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గానికి సంబంధంలేని వ్యక్తులు పాలకొల్లులో పెత్తనం చేయడం వల్ల పాలకొల్లుతోపాటు జిల్లాలో వైసిపి ఘోరంగా ఓడిపోయిందని మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు విమర్శించారు. వైసిపి అధిష్టానం శేషుబాబును పార్టీ నుంచి బహిష్కరించినట్లు వచ్చిన వార్తలపై ఆయన స్వగృహం వద్ద కుటుంబ సభ్యులతో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో రూ.30 కోట్లు ఆ వ్యక్తికి ఖర్చులకు ఇవ్వగా ఆయన ఖర్చు పెట్టకుండా వైసిపి నేతలను, కార్యకర్తలను ఏడిపించి ఫోన్ కట్టేసి పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డాడని తెలిపారు. అతనిని ముందుగా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ అటువంటి వారి చెప్పుడు మాటలకు ప్రాధాన్యతిస్తోందన్నారు. తాను క్యాబినెట్ హోదా గల జెడ్‌పి ఛైర్మన్ పదవికి రాజీనామా చేసి వైసిపికి తొలి ఎంఎల్‌సిని అందించానని గుర్తు చేశారు. 2014, 2024 ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారి వల్ల జిల్లాల్లో వైసిపి ఘోరంగా ఓడిపోయిందని చెప్పారు. పార్టీ నిజమైన నేతలను పక్కన పెట్టి పికె, వైకె టీంలను నమ్మి నాశనం చేసిందని చెప్పారు. నియోజకవర్గానికి ఇతర చోట్ల నుంచి నేతలను తీసుకొచ్చి పదవులు ఇచ్చిందని, పాలకొల్లులో మొలతాడు కట్టిన మగవారు లేరా అని ప్రశ్నించారు. గతంలో గుణ్ణం నాగబాబుకు ఇలాగే చేశారని చెప్పారు. పార్టీ కోసం పనిచేసిన బిసి నేత అని కూడా చూడకుండా ఇలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అన్యాయం చేసిన వారిని ప్రశ్నిస్తానని హెచ్చరించారు. శేషుబాబు కుటుంబం వైఎస్ఆర్‌కు విధేయులై ఉన్నారని, అందుకు సొంత సొమ్ము కోట్లు ఖర్చు చేశారని శేషుబాబు భార్య ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం శేషుబాబు అనుచరులు ఆయన కార్యాలయంలోని వైసిపి జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు చింపేసి నిప్పంటించారు. తన అనుచరులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయం ప్రకారం భవిష్యత్తులో నడుచుకుంటానని శేషుబాబు ప్రకటించారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.

వైజ్ఞానిక విషయాలపై అవగాహనుండాలి

భీమవరంలో 5 నుంచి 7 వరకూ ఇస్రో వైజ్ఞానిక పండుగ - జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

విద్యార్థి దశ నుంచే వైజ్ఞానిక విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్ ఛాంబర్ వద్ద శ్రీహరికోట ఇస్రో కార్యాలయ ఉద్యోగులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా రాష్ట్రంలో భీమవరాన్ని ఎంపిక చేసి అక్టోబర్ 5 నుంచి ఏడో తేదీ వరకూ ప్రత్యేక కార్యక్రమాలు భీమవరంలో నిర్వహించనున్నట్లు తెలిపే కరపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులు వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. అవకాశం మేరకు వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో నేర్చుకొని, అంతర్జాలం శోధించి తెలుసుకోవాలని సూచించారు. అక్టోబర్ నాలుగో తేదీ నుంచి 10వ తేదీ వరకూ వారం రోజులపాటు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల నిర్వహణ జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిస్సా రాష్ట్రాలను రాష్ట్రాల్లోని పది ప్రాంతాలను ఎంపికచేసి, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణాన్ని ఎంపిక చేసి అక్టోబర్ ఐదు నుంచి ఏడో తేదీ వరకూ శ్రీహరికోట ఇస్రో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ ఆధ్వర్యంలో భీమవరం విష్ణు స్కూల్ వద్ద వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరల్డ్ స్పేస్ వీక్‌ను ఈ సంవత్సరం 'స్పేస్ అండ్ క్లైమేట్ చేంజ్' థీమ్‌తో నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 5న స్పేస్ వాక్ కార్యక్రమం ప్రారంభించి, 6న స్పేస్ క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల నిర్వహణ ఉంటుందన్నారు. అలాగే ఇస్రో ఎగ్జిబిషన్, వీడియో స్క్రీనింగ్ కార్యక్రమాల ఏర్పాటు జరుగుతుందని, వీటిని జిల్లాలోని అన్ని కళాశాలల, పాఠశాలల విద్యార్థులు ఉచితంగా సందర్శించి వైజ్ఞానిక విషయాలను తెలుసుకోవచ్చన్నారు. స్పేస్ క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ

పోటీలను వివిధ పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో, కళాశాలలో కూడా నిర్వహించడం జరుగుతుందని, ఆయా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ పోటీదారులకు ఆరో తేదీన విష్ణు స్కూల్ వద్ద మరోసారి పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వివిధ పాఠశాలల్లో, కళాశాలల్లో నిర్వహించే తొలిదశ పోటీల్లో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ఏడో తేదీన సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్, పోస్టల్ డిజైనింగ్, వక్తృత్వ పోటీలు, గెస్ట్ లెక్చర్స్, ఇస్రో ఎగ్జిబిషన్, వీడియో స్క్రీనింగ్, ముగింపు సభ ఉంటుందని తెలిపారు. ఇస్రో నిర్వహిస్తున్న కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని వైజ్ఞానిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో శ్రీహరికోట ఇస్రో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి క్వాలిటీ కంట్రోల్ జనరల్ మేనేజర్ పి.ఏడుకొండలు, హెడ్ ఆఫ్ సివిల్ డిపార్ట్మెంట్ ఎంవిఎల్.సతీష్, ఇన్స్ట్రుమెంటేషన్ డిపార్ట్మెంట్ సైంటిస్ట్ ఆకెళ్ల శేషసాయి పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - గణపవరం

నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం గణపవరం మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి పార్టీ మండల నాయకులు చిన్నంచిన నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో బలరాం మాట్లాడుతూ ధరలు సామాన్యులకు అందనంత ఎత్తులో ఉన్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అనేక మంది రైతులు, కౌలురైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. రోడ్లు పూర్తిగా గోతులమయం కావడంతో వాహనదారులు, బాటసారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టి ప్రమాదాలను నివారించాలన్నారు. ఉండి కాలువపై ఉన్న కేశవరం వంతెన, వెంకయ్య వయ్యేరుపై ఉన్న గణపవరం బొబ్బిలి వంతెనలను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. బొబ్బిలి వంతెన ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉందన్నారు. కేశవరం వంతెన కూలిపోయి ఏళ్లు గడిచినా బెయిలీ వంతెన పైనుంచి రాకపోకలు జరుగుతున్నాయన్నారు. బెయిలీ వంతెన శిథిలావస్థకు చేరినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వంతెనలు వెంటనే నిర్మాణం చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కమిటీ కార్యదర్శి పి.నరశింహమూర్తి, ఎం.పెంటారావు పాల్గొన్నారు.

చించినాడలో దళితునిపై పెత్తందారుల దాడి

పోలీసులకు బాధితుని ఫిర్యాదు

యలమంచిలి: మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన దళిత నాయకుడు కానేటి బాలరాజుపై అగ్రవర్ణ పెత్తందారులకు చెందిన వ్యక్తులు దాడి చేసి చంపడానికి ప్రయత్నించారు. ఈ మేరకు ఆయన గురువారం యలమంచిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. లంకలో తన పొలంలో కొబ్బరి మొక్కలు వేయించేందుకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా గుర్రాజు పొలం వద్ద గేటు కొట్టు సమీపంలోకి వచ్చేసరికి తమ గ్రామానికి చెందిన రుద్రరాజు కృష్ణంరాజు, రుద్రరాజు బలరామకృష్ణంరాజు, ముదునూరి రంగరాజు, ముదునూరి సత్యనారాయణరాజు, ముంగండ మణికంఠ నాగ వెంకట సాయి రమేష్ తనను అడ్డుకుని ఎక్కడికి వెళ్తున్నావని ప్రశ్నించారని తెలిపారు. లంకలో తన పొలం వద్దకు వెళ్తున్నా అని చెప్పగా, నీవు అటు వెళ్లడానికి వీల్లేదని, వెనక్కి వెళ్లిపోవాలని హెచ్చరించారని పేర్కొన్నారు. నా పొలం వద్దకు నేను వెళ్తే సమస్య ఏమిటని అనగానే మాకే ఎదురు చెబుతావా, నీకు లంక భూమి లేకుండా చేస్తామని, ముక్కలు ముక్కలుగా నరికేస్తామని కులం పేరుతో పరుష పదజాలంతో దూషిస్తూ కింద పడవేసి విచక్షణారహితంగా తలపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మూడు రేషన్ షాపులు సీజ్

భీమవరం టౌన్: పట్టణంలో రేషన్ షాపులను తనిఖీ చేసి స్టాకు పరిమితికి మించి ఎక్కువ, తక్కువ ఉన్న మూడు షాపులపై కేసు నమోదు చేశామని సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ సురేష్ తెలిపారు. గురువారం ఏలూరు విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో భీమవరంలోని 0584031 నంబరు షాపులో బియ్యం 600 కేజీలు, పంచదార 23 కేజీలు, ఆట 70 కేజీలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. 0584022 నంబరు షాపులో బియ్యం 559 కేజీలు, పంచదార 5 ప్యాకెట్లు తక్కువ ఉన్నాయని, 0584002 నంబరు షాపులో పంచదార 400 ప్యాకెట్లు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అందువల్ల ఆయా రేషన్ షాపులను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీరవాసరంలో ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

ఆటల పోటీలు ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్

వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద మండల స్థాయి ఆటల పోటీలు ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, కోకో, యోగా అథ్లెటిక్స్, చెస్ విభాగాల్లో పోటీలు నిర్వహించి మండల జట్టును ఎంపిక చేశారు. ఈ జట్లను ఎంపిక చేయడంలో వ్యాయామ ఉపాధ్యాయులు బాజింకి శ్రీనివాసరావు, పంతకాని శ్రీనివాసరావు, పూడి శ్రీనివాస్, పెద్దిరాజు, ఎస్-ఎల్‌డి.రవి, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏచూరి, ఆర్ఎస్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

సీతారాం ఏచూరి, ఆర్ఎస్ ఇరువురు వేగుచుక్కలు వంటివారని, వారి ఆశయాలను కార్మికవర్గం ముందుకు తీసుకెళ్లాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. దోపిడీలేని కార్మికవర్గ రాజ్యాధికారం కోసం విశేష కృషి చేసిన ఏచూరి, ఆర్ఎస్ మృతి కార్మిక వర్గానికి తీరని లోటన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద గురువారం బజార్ లాగుడు బండ్ల ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లు తీసుకురావడాన్ని సీతారాం ఏచూరి తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. మోడీ ప్రభుత్వం ప్రజల హక్కులు కాలరాస్తున్న నేపథ్యంలో కార్మిక, కర్షక ఉద్యమాలు నడిపారని తెలిపారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి మతోన్మాద శక్తుల నుంచి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. ప్రజల పక్షాన స్థిరమైన పోరాటం నిర్వహించారన్నారు. జిల్లాలో కార్మికుల పట్ల యాజమాన్యాల దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని ఐక్యంగా ఆర్ఎస్ నిలబెట్టారన్నారు. ఏచూరి, ఆర్ఎస్ ఆశయాల కోసం కార్మిక వర్గం ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.అప్పన్న, కె.కృష్ణ, రాజు, రంగ పాల్గొన్నారు.

న్యాయవాదిని పెట్టుకోలేకపోతే కోర్టు ద్వారా ఏర్పాటు

ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్

ప్రజాశక్తి - తణుకు

కేసులు వాదించేందుకు ప్రతి ఒక్కరూ న్యాయవాదిని కలిగి ఉండాలని, ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేకపోతే కోర్టు ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని జిల్లా న్యాయ సేవల సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్, ఏలూరు జడ్జి కె.రత్నప్రసాద్ తెలిపారు. గురువారం రాష్ట్ర న్యాయసేవల సంస్థ అమరావతి వారి ఉత్తర్వుల ప్రకారం, ఛైర్మన్, జిల్లా జడ్జి చింతలపూడి పురుషోత్తమరావు ఆదేశాల మేరకు జడ్జి కె.రత్నప్రసాద్ తణుకు సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి రత్నప్రసాద్ సబ్‌జైలును సందర్శించి వారికి అందుతున్న ఆహార, వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకుని ఆహారాన్ని రుచి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిక్షపడి అప్పీల్ చేసుకొనేందుకు స్తోమత లేకపోతే వారికి కూడా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. కేసుల్లో పురోగతి కోసం న్యాయ సలహా, సహాయం కోసం జైలులో క్లినిక్ ఉందని, దానిలో ఒక ప్యానెల్ న్యాయవాది, పారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారానికి రెండుసార్లు అందుబాటులో ఉండి సలహాలు, ఉచిత న్యాయ సహాయం అందిస్తారని

తణుకు సబ్‌జైలులో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జడ్జి రత్నప్రసాద్

తెలిపారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ జి.మోహనరావు, జైలు విజిటింగ్ న్యాయవాది చింతపల్లి నాగేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్ సాధనాల వెంకటగిరి, న్యాయవాదులు తిర్రే సత్యనారాయణరాజు, కాకుల విజయ, జెఆర్‌విఎస్ఎస్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నరసాపురం: ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ గురువారం నరసాపురం ఉప కారాగారాన్ని పర్యవేక్షించారు. నిందితుల కేసుల వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర విషయాలను ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాదారులు ముద్దాయిలకు అందించే న్యాయ సహాయంపై ఆరా తీశారు. జైలు ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. జైలు ముద్దాయిలకు నియమించబడిన లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ అందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. వంటశాల, స్టోర్‌రూంను, తనిఖీ చేశారు. జైల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది ఎన్.ఆనందబాబు, పిఎల్‌విఎన్.రాంబాబు, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ డి.నరసింహరాజు జైలు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మార్టేరు శ్రీవేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పెనుమంట్ర మండల స్థాయి యోగ, కబడ్డీ, చెస్ విభాగాల్లో అండర్-14, అండర్-17 విభాగాలలో బాలుర, బాలికల టీంలను సెలెక్ట్ చేశారు. మార్టేరు జెడిపి హైస్కూల్ విద్యార్థులు, జెడిపి హైస్కూల్ అలమూరు విద్యార్థులు, జెడిపి హైస్కూల్ పెనుమంట్ర విద్యార్థులు, జెడిపి హైస్కూల్ జుత్తిగ విద్యార్థులు, గురుకుల రెసిడెన్షియల్ స్కూల్, నెగ్గిపూడి విద్యార్థులు పాల్గొన్నారు. నియోజకవర్గస్థాయిలో పాల్గొనడానికి ఎన్నిక కాబడినటువంటి క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.నారాయణరెడ్డి అభినందించారు. ఈ సెలక్షన్స్‌లో మండల కోఆర్డినేటర్ పడాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ కర్రి కృష్ణారెడ్డి, పీడీలు అలమూరు, పోలమూరు, జుత్తిగ, పిడి కెనడి, సునీత పాల్గొని సెలక్షన్స్ నిర్వహించారు.

తణుకు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగాలలో బాలబాలికల క్రీడా జట్ల ఎంపికలు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలియజేశారు. కళాశాల జాయింట్ సెక్రటరీ చిలుకూరి వెంకటకృష్ణారావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడాకారులు ప్రతీ ఒక్కరూ ధృడనిశ్చయంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా కీర్తిని పెంచాలన్నారు. పలు కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులను క్రమపద్ధతిలో ఎంపిక చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ హిమబిందు మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, యోగా, త్రోబాల్, చదరంగం, టెన్నికాయిట్ విభాగాల్లో 250 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ జిల్లా సెక్రటరీ కె.జయరాజు, శ్రీ కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీనారాయణబాయి, ఎస్‌కెఎస్‌డి కళాశాల ప్రిన్సిపల్ వివి సత్యనారాయణరెడ్డి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాస్, ఎస్.రత్నకుమారి పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : డిఎన్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆనకోడేరులో క్రీడా పోటీలను గ్రామ సర్పంచి జుత్తుగ కనకదుర్గ వరప్రసాద్ గురువారం ప్రారంభించారు. వాలీబాల్ పోటీలను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సుంకర పరమేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కబడ్డీ, కోకో, చెస్, యోగ, వాలీబాల్, జంప్ అండ్ త్రోస్, పరుగు పందెం, షాట్ పుట్, డిస్కస్ త్రో, జావె లిన్ త్రో, లాంగ్ జంప్ మొదలగు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 400 మంది విద్యార్థులు, 20 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులు అక్టోబర్‌లో వీరవాసరంలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు.

పలుచోట్ల అన్నసమారాధన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పంచాయతీ పరిధిలోని మసీదు వీధిలో వినాయక ఆలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపవరం, సరిపల్లి, బువ్వనపల్లి గ్రామాలకు చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని కోట రోడ్డులో ఉన్న దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. యాత్రికులు బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులను చెల్లించుకున్నారు. అనంతరం దత్తసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మండల కేంద్రం మొగల్తూరులోని గ్రామదేవత వద్ద గురువారం రాత్రి భారీ అన్న సమారాధన చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినికి అభినందన

ప్రజాశక్తి - పెనుగొండ

స్థానిక పెనుగొండ వివేక బాల భారతి స్కూల్లో విద్యనభ్యసించినటువంటి పూర్వ విద్యార్థిని లహరికి అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజీలో సీటు వచ్చిన సందర్భంగా ఆమెను స్థానిక వివేక బాల భారతి కరస్పాండెంట్ సుబ్బారాయుల రెడ్డి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం అభినందించారు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు తండ్రి బొబ్బి, తల్లి శాంత నిర్మల మార్టేరు బసంతి దేవి హైస్కూల్లో ఇంగ్లీష్ టీచర్ పని చేయుచున్నారు. భవిష్యత్తులో కార్పొరేట్లకు అన్యాలోనే తన ఆశయమని చెబుతూ పేద ప్రజలకు మంచి వైద్యం అందించాలనేది తన కోరిక అని తెలియపరిచింది.

క్రీడల్లోనూ రాణించాలి : ఎంఇఒ

తాడేపల్లిగూడెం : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు లభించడంతోపాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి వి.హనుమ తెలిపారు. గురువారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన 68వ మండల స్థాయి ఉన్నత పాఠశాలల క్రీడా పోటీలను ఎంఇఒ-2 జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎంఇఒ హనుమ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉంటే విద్యతోపాటు, క్రీడల్లో రాణించవచ్చు అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు సాధించాలంటే క్రీడల్లో నైపుణ్యాభివృద్ధిని ప్రదర్శించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాభివృద్ధిని బయటికి తీసేందుకు ఈ క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గెలుపు, ఓటములు పట్టించుకోకుండా ఎంచుకున్న క్రీడల్లో రాణించేందుకు కృషి, పట్టుదలతో ముందుకు వెళ్లాలన్నారు. క్రీడలతో పాటు యోగా నేర్చుకోవాలన్నారు. శారీరక ధృఢత్వంతో పాటు మానసిక శక్తి పెరిగేందుకు క్రీడలు దోహదం చేస్తాయన్నారు. జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలంటే క్రీడలతోనే సాధ్యమని అన్నారు. విద్యార్థి స్థాయినుంచే విద్యతో పాటు క్రీడలో రాణిస్తే జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని సూచించారు. కృషి, పట్టుదలతో ఎంచుకున్న క్రీడల్లో రాణించాలని కోరారు. ఆటల పోటీలలో విజేతలు, పరాజితులు మాత్రమే ఉంటారు కానీ గెలుపోటములు జీవితంలో ఉంటాయని, సమస్య పరిష్కార పరిజ్ఞానం పెంపొందించుకోవడానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, మండల కోఆర్డినేటర్ ఎ.ఈశ్వర్, మండలంలోని అన్ని పాఠశాలల పీడీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి చెరుకువాడ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి మాజీమంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పుట్టినరోజు వేడుకలు కార్యకర్తల మధ్య అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆచంట నుంచి వైసిపి కార్యకర్తలు తాడేపల్లిగూడెం రంగనాథరాజు ఇంటికి వెళ్లి భారీ ఎత్తున గజమాలలతో సన్మానించి సత్కరించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి రంగనాథరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కొడమంచిలి సర్పంచి సుంకర సీతారామ్, నేతలు కోట వెంకటేశ్వరరావు, మట్ట ఆనంద్ కుమార్ ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

అదనపు కట్నం కోసం భర్త వేధింపులు

ప్రజాశక్తి - ఉండి

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై ఉండి పోలీస్ స్టేషన్‌లో భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి గ్రామానికి చెందిన చిగురుపాటి కరిష్మాకు 2020వ సంవత్సరంలో తణుకుకు చెందిన మర్లపూడి రాజకుమార్ అనే వ్యక్తితో వివాహమైంది. వివాహ సమయంలో రాజకుమార్‌కు రూ.2 లక్షల నగదు, బంగారం కట్నంగా ఇచ్చారు. జల్సాలకు బానిసైన రాజకుమార్ వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భార్య కరిష్మాతో బ్యాంక్ లోన్ పెట్టించుకుని ఆ డబ్బు, భార్యకు వచ్చే జీతం రాజకుమార్ తన జల్సాలకు వాడటమే కాకుండా అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తూ, అసభ్యకరంగా మాట్లాడుతుండే వాడని అన్నారు. ఇంకా పిల్లలు పుట్టలేదనే సాకుతో వేధింపులు మితిమీరడంతో తట్టుకోలేని భార్య కరిష్మా ఉండి పోలీస్ స్టేషన్‌లో భర్త రాజకుమార్‌పై ఫిర్యాదు చేశారు. ఉండి ఎస్‌ఐ మహమ్మద్ నశీరుల్లా రాజకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో యువకుడి మృతదేహం గురువారం లభ్యమైంది. దీనికి సంబంధించి స్థానికులు, కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరంలోని వెంటే వారి తోటకు చెందిన గంధం ప్రవీణ్ కుమార్(17) తన సోదరుడు, మిత్రులతో కలిసి ఈనెల 18న పేరుపాలెం బీచ్‌కు వెళ్లారు. సముద్ర అలలలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు లోనికి కొట్టుకు వెళ్లి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం గాలిస్తుండగా సముద్ర తీరంలో ఒడ్డున మృతదేహం లభ్యమైందని ఎస్ఐ జి.వాసు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా వాసవి జిఎంఆర్‌లో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శ్రీవాసవి జిఎంఆర్ డిగ్రీ కాలేజ్‌లో గురువారం ఫ్రెషర్స్ డేని కళాశాల ప్రిన్సిపల్ విఎస్ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డిగ్రీ రెండవ సంవత్సరం, మూడవ సంవత్సరం విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులందరినీ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు మాట్లాడుతూ ఎలా ఉండాలి, ఎలా చదువుకోవాలి అనే విషయాలను జూనియర్ విద్యార్థులకు వివరించారు. దీనికి కృతజ్ఞతగా జూనియర్స్ సీనియర్ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ

తాడేపల్లిగూడెం : మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ఇలా ఆహ్వానించడం మంచి పరిణామమన్నారు. విద్యార్థులందరూ స్నేహపూర్వకంగా ఉండాలని, చదువులలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని, చదువుతోపాటు ఇతర భాషలలో ప్రావీణ్యాన్ని సంపాదించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వివిఎన్.లక్ష్మీనారాయణన్, సూరిబాబు, సత్యనారాయణమూర్తి, కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - ఉండి

చిరుధాన్యాలు, ఆకుకూరలతో కూడిన ఆహారం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.మేరి అన్నారు. గురువారం ఉండి కొత్తపేటలో నిర్వహించిన పోషకాహార మహోత్సవంలో భాగంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని తద్వారా రక్తహీనత తగ్గి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే పౌష్టికాహారాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం రక్తహీనత వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు కె.అనురాధ, కె.రత్నం, ఎస్.అనంతలక్ష్మి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

విరాళాలందించడం అభినందనీయం : కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

విజయవాడ వరద బాధితులకు భారీ విరాళాలు అందజేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థుల ద్వారా సేకరించిన రూ.8,53,768 డిమాండ్ డ్రాఫ్‌ను జిల్లా కలెక్టర్‌కు జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి చేతుల మీదగా గురువారం అందజేశారు. అలాగే కోపరేటివ్ సహకార సంఘాలు రూ.6,05,053 విరాళాన్ని జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, డిఎల్‌సిఒ కె.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్ట్రర్లు రామ్‌దాసు, హనుమంతరావు, ఇతర సిబ్బంది అంతా కలిసి చెక్కును కలెక్టర్‌కు అందజేశారు.

యలమంచిలి : మండలంలోని పెదలంక, కనకాయలంక గ్రామాలలో గురువారం కూటమి ప్రభుత్వ నాయకులు ఇటీవల వచ్చిన వరదల్లో నష్టపోయిన వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కనకాయలంక సర్పంచి తాళ్ల నాగరాజు మాట్లాడారు. కూటమి నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, పులి శ్రీరామ్మూర్తి, శ్యాంబాబు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : వరద బాధితులకు తమ వంతుగా ఎంతో కొంత సహాయ పడాలనే ఉద్దేశంతో పాలకొల్లు జోన్‌లోని ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాల నుంచి విరాళాలను సేకరించారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు స్పందించి విరాళాలు అందజేశారు. ఈ మొత్తాన్ని సిఎం సహాయనిధికి చేరే విధంగా పాలకొల్లు జోన్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ తరపున ఆర్‌జెడి జి.నాగమణికి డిడిను అందజేశారు. ప్రెసిడెంట్ షాజహాన్, సెక్రటరీస్ శ్రీరామ్, ఆర్‌కిడ్జ్ స్కూల్స్ డైరెక్టర్ ఎంపి.జానకీరామ్ పాల్గొన్నారు.

ఆచంట : విజయవాడ వరద బాధితుల సహాయార్థం కొడమంచిలి జనసేన తరపున కార్యకర్తలు, అభిమానుల నుంచి సేకరించిన విరాళాలు రూ.22 వేల 500 ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌కు గురువారం అదజేశారు. కాగా భీమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సేకరించిన విరాళాలు రూ.13 వేల 500 ఎంఇఒ-2 రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుబ్బల మాధవరావు, ఆచంట జనసేన మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ పాల్గొన్నారు.

పెనుమంట్ర : వరద బాధితులకు అండగా మేము కూడా ఉన్నాం అంటూ మండలంలోని వెలగలేరు గ్రామంలోని శ్రీసంఘమిత్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ రూ.లక్ష విరాళాన్ని గురువారం బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్ రూపంలో అందించారు. ఈమేరకు ఎల్‌కెజి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులు రూ.47,500, ఉపాధ్యాయులు ఒకరోజు వేతనం రూ.7,500, యాజమాన్యం, వారి కుటుంబ సభ్యులు రూ.45 వేలు జత చేసి, మొత్తంగా లక్ష రూపాయల విరాళాన్ని చెక్ రూపంలో ఎపిపియుఎస్ఎంఎ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకోడేరు : గొరకనుముడి సబ్ స్టేషన్ వద్ద 11 కేవీ కొండేపూడి ఫీడర్, మాగోళ్ల సబ్ స్టేషన్ వద్ద ఫీడర్ లైన్ నిర్వహణ, చెట్లు కొమ్మలు తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెన్నాడ, మొగల్లు గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో షుగర్ వైద్య శిబిరం

ఉండి : షుగర్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉండి ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణ రాజు అన్నారు. గురువారం ఉండి కూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత షుగర్, బిపి వైద్య శిబిరాన్ని శ్రీహరి నారాయణ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మధుమేహ వ్యాధి అదుపులో ఉంటుందన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు మాట్లాడుతూ సమాజంలో షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య నానాటికి పెరిగిపోతుందన్నారు. షుగర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా వుండాలని కోరారు. క్లబ్ ఉపాధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ షుగర్ వ్యాధి అదుపులో ఉండాలంటే ప్రతీఒక్కరూ వ్యాయామాన్ని తప్పనిసరిగా చేయాలని అన్నారు. డాక్టర్ స్వామి మాట్లాడుతూ డాక్టర్ సూచనలు పాటిస్తూ, ఆహారంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ జీవన శైలిలో మార్పు అనివార్యం అన్నారు. అనంతరం డాక్టర్ స్వామిని లయన్స్ క్లబ్ బృందం శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐక్య నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షులు ఆచారి, లయన్స్ సభ్యులు కూనపరాజు రామరాజు, పాలతీర్థపు నరసింహ రావు, వేగేశ్న అనంతలక్ష్మి, కలిదిండి సీతారామరాజు, కాగిత మహంకాళీ, బుద్ధరాజు సుబ్బరాజు, నంబూరి కాశీ విశ్వేశ్వర రావు, గాదిరాజు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు. సుమారు 75 మంది ఈ శిబిరంలో వైద్యసేవలు పొందారు.

రామ్మోహన్‌నాయుడు సేవలు ఆదర్శనీయం

ఎంఎల్‌ఎ నాయకర్


ఎంఎల్ఎకు మందులు అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - నరసాపురం

సమాజంలో పేదలకు, అనాథలకు, రోగులకు కొవ్వలి రామ్మోహన్‌నాయుడు అందిస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తాయని నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. నరసాపురం పట్టణం 7వ వార్డులో కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్, టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు ప్రతినెలా రోగులకు అందిస్తున్న మందులను ఎంఎల్ఎ నాయకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ఉండాలన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కొవ్వలి నాయుడు ఆయన సంపాదనలో ఎక్కువ మొత్తాన్ని ఆపదలో ఉన్న పేదలకు, ఆయనను ఆశ్రయించిన అనాథలకు వినియోగిస్తూ ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో కూడా కొవ్వలి నాయుడు మరింత సేవలు అందిస్తూ అందరి ఆదరాభిమానాలు పొందాలని ఆకాంక్షించారు.

ప్రతి విద్యార్థీ పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

ఉండి : ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవర్చుకోవాలని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. గురువారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏలూరి రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మహా వందనం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ నేటితరం విద్యార్థులకు స్వాతంత్ర సమరయోధుల చరిత్ర తెలియాలనే ఉద్దేశంతో మహా టివి మహా వందనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించాలనే లక్ష్యంతో ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు పాఠశాలను అభివృద్ధి చేయడమే కాకుండా క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేసి అందులో వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్ వంటి క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లను చేస్తున్నారన్నారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో పాఠశాల అభివృద్ధి పనులను దాతల భాగస్వామ్యంతో చేయించడం అభినందనీయమని అన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. జనసైనికులు అడపా గణేష్, ఆరేపల్లి వెంకటేష్, మోపిదేవి హరి, బెల్లపు బాలాజీ, మేడిది సాయి జగన్నాథ్, కంది దుర్గాప్రసాద్, శివసాయి, నల్లమాటి రమేష్ పాల్గొన్నారు.

ముదునూరి ప్రసాదరాజుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - నరసాపురం


ప్రసాద్‌రాజును అభినందిస్తున్న నేతలు

వైసిపి జిల్లా అధ్యక్షులుగా మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ముదునూరి ప్రసాదరాజుని నియమిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకుని పార్టీ కేంద్ర కార్యాలయం ద్వారా బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ముదునూరి ప్రసాదరాజుకు పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ, జయరాజు, వైస్ చైర్మన్ కామన నాగిని, మల్లాడి శేషవేణి, చిట్టూరి వెంకట పద్మ, గంగా భవాని, కావలి రామసీత, పతివాడ మార్కండేయులు, మల్లాడి బుజ్జి, చిట్టూరి కృష్ణ, ప్రకాష్, కావలి నాని పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నరసాపురం : స్థానిక శ్రీవైఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో భాగంగా గురువారం కోటవద్దపాలెం కొండాలమ్మ గుడి చుట్టుపక్కల ప్రాంతాలందు ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాల ఏరివేత కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపైనా, ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనార్థాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కళాశాల డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, రిటైర్డ్ డాక్టర్, నర్సింగ్, హెల్త్ కేర్ సెంటర్ హెడ్ డాక్టర్ ఎల్.రాజేంద్ర ప్రసాద్, ఎన్ఎస్ఎస్ స్వచ్ఛతా హి సేవా ప్రాజెక్టు డైరెక్టర్ చింతా సోమేశ్వరి పాల్గొన్నారు.

ఉండి: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛ పల్లెలే లక్ష్యంగా పరిసరాలను శుభ్రం చేయాలని కలిసిపూడి ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వర రావు అన్నారు. గురువారం ఉండి మండలం కలిసిపూడి గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల పల్లెలు స్వచ్ఛంగా ఉంటాయన్నారు. అనంతరం గ్రామపంచాయతీ వద్ద మానవహారం నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : గ్రామాల్లో అందరూ స్వచ్ఛత కోసం పాటుపడాలని జనసేన మండల కమిటీ అధ్యక్షులు కోయ వెంకట కార్తీక్ అన్నారు. గురువారం మండలంలోని నెలమూరు ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవా 2024 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛత గురించి ప్రతిజ్ఞ చేయించారు. చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం నిరంతర అలవాటుగా మారాలని, ఇందుకు ప్రజల చైతన్యం అనేది కీలకమైందన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి పాల్గొనాల్సిందిగా అభ్యర్థిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నెలమూరు గ్రామ సర్పంచి కుచ్చెర్లపాటి మంగతాయారు, వైస్ ప్రెసిడెంట్ కోయ మోహన్ రావు, టిడిపి గ్రామ అధ్యక్షులు నాగరాజు రామ్మోహన్‌రాజు, జనసేన గ్రామ అధ్యక్షుడు నాగరాజు, అప్పల నరసింహరాజు పంచాయతీ సెక్రెటరీ ప్రసాద్, అంగన్వాడీ సిబ్బంది, హెల్త్ డిపార్ట్మెంట్ అందరూ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : గ్రామంలో ప్రతి పౌరుడు పరిశుభ్రత పాటించి పరిసరాలను బాగు చేసుకున్నప్పుడు అంతా ఆరోగ్యంగా ఉంటామని ఎంపిడిఒ విశ్వనాథ్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో సర్పంచి ఉండ్రాజవరపు చంద్రిక ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు కార్యక్రమం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపిటిసి నార్ని నాగు, ఉప సర్పంచి గోడవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణపవరం : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక డిగ్రీ కాలేజీ విద్యార్థులు కాలేజీ పక్కన ఉన్న పంటకాలువను బాగుచేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ అక్టోబరు 1వ తేదీ వరకు జరిగే స్వచ్ఛతా హి సేవాలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొంటారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్‌కి భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, రీజనల్ ఆఫీస్ హైదరాబాద్ వాలంటీర్లకు రూ.25 వేలు కేటాయించినట్లు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో గణపవరం డిగ్రీ కాలేజీ ఎంపిక కావటం ఎంతో గర్వకారణమని అన్నార. యూనిట్ తరుపున సరిపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో కూడా విద్యార్థులు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పోగ్రాం అధికారి జి.వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

100 రోజుల పాలనపై ప్రజల్లోకి..

భీమవరం టౌన్ : ఎన్‌డియే కూటమి వందరోజుల పాలనపై ప్రజల్లోకి వెళ్లేందుకు వారంరోజుల కార్యక్రమ ప్రణాళికను ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి తెలిపారు. బుధవారం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో పట్టణ, మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులతో ఆమె మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా భీమవరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో వీరవాసరం మండల అధ్యక్ష, కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు రేవు వెంకన్న, కవూరు పృథ్వీశంకర్, భీమవరం పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు పాల్గొన్నారు.

దావా సమను
మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No: 8/2013
Between :
పసుపులేటి వీర మణికంఠ నాయుడు మరియొకరు ..... వాదులు
మరియు
పసుపులేటి వెంకటేశ్వర్లు మరియు ఇతరులు ..... ప్రతివాదులు (1 to11)
To
1.జయమంగళం పెదిన్‌టిమ్మ ఎలియాస్ పెద్దింటిన్‌టమ్మ w/o ప్రభుదాస్..... 8వ ప్రతివాది
2. జయ మంగళం నాగరాజు S/o ప్రభుదాస్ 9 వ ప్రతివాది
3. జయమంగళం సంతోష్ కుమార్ S/o ప్రభుదాస్ ... 10 వ ప్రతివాది
4. జయ మంగళం వెంకన్న ఎలియాస్ వెంకటేశ్వర్లు S/o ప్రభుదాస్ 11 వ ప్రతివాది
8 to 11 ప్రతివాదులు R/o డోర్ నెంబరు 2-70, రామాలయం గుడి ఎదురు, పెనుములంక గ్రామం మరియు పోస్టు, మందవల్లి మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.
పై నెంబరు దావాను వాదులు దావా పరిహారంలు పొందు నిమిత్తం దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీరు 8 to11 ప్రతివాదులు అయివుండి యిందును గూర్చి మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమనులు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రికా ప్రకటన ద్వారా దావా సమనులు జారీ చేయవలసినదిగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు.ఇందు నిమిత్త మై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 18-10-2024వ తేది ఉదయం 10:30 ని. లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుప వలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.
// శ్రీ కోర్టు వారి అనుమతితో //
అద్దంకి.
18-09-2024
ఇట్లు
పంచాగ్నుల రమేష్, అడ్వకేట్
అద్దంకి, బాపట్ల జిల్లా
సెల్ : 9948788290

ఎంపీ నిధులతో రోడ్ల పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోనీ అయిభీమవరంలో కాలువ గట్టున ఇల్లు నిర్మించుకుని కాపురాలు ఉంటున్న సుమారు 92 మందిని ఖాళీ చేయించేందుకుగాను స్థలాలను ఏర్పాటు చేస్తున్నామని ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు తెలిపారు. గురువారం ఆయన ప్రభుత్వం గతంలో పేదల ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూములను ఆయన పరిశీలించారు. ఈమేరకు కాల్వగట్టు నివాసితులకు అర్హులందరికీ పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఆ స్థలంలో ఇప్పటికే మంచినీటి పైప్ లైన్ నిర్మాణం పూర్తయిందని, వెంటనే విద్యుత్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆమేరకు అక్కడక్కడా అధికారులకు ఆయన ఆదేశించారు. వెంటనే ఇల్లు ఖాళీ చేయాల్సి ఉందన్నారు. అయితే ఆ ఇళ్లలో ఉన్న వారు నాలుగు నెలలు గడువు కోరినందు వల్ల నాలుగు నెలల అద్దెకు గాను ప్రతి కుటుంబానికి నగదు సహకారం అందచేస్తామని ఆయన చెప్పారు. ఎంపీ నిధులతో మంజూరైన రెండు రోడ్లను ఆయన పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గాలి సామ్రాజ్యం, ప్రముఖులు కనుమూరి అబ్బాయి రాజు, మాజీ సర్పంచి కనుమూరి రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది
ముత్యాల విజయ ప్రకాష్, తండ్రి: త్రిమూర్తులు, డి.నెం.4-5, మెయిన్‌రోడ్, బల్లిపాడు, అత్తిలి మండలం నాకు సంబంధించిన కానూరు అగ్రహారం గ్రామం పొలం దస్తావేజులు 0-14 సెంట్లు, ఆర్ఎస్ నెం.1/132 మరియు 0.52 సెంట్లు, ఆర్ఎస్ నెం.213 మొత్తం 0.66 సెంట్లు డాక్యుమెంట్ నెం.పి212/2017 బల్లిపాడు నుండి అత్తిలి వెళ్ళుచుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. ఈ డాక్యుమెంట్లు ఎవ్వరికైనా దొరికినయెడల దయచేసి ఈ క్రింది నెంబరుకు తెలుపగలరు.
సెల్: 99599 59399

డాక్యుమెంట్స్ పోయినవి
వెలగల వెంకట ధనలక్ష్మీ అను నేను అత్తిలి మండలం, ఆరవల్లి గ్రామంలో డో.నెం.2-27/ఎ, నివసిస్తున్నాను. ది.10-09-2024వ తారీకులో రిజిష్టర్డ్ సేల్ డీడ్ నెం.1733/2016 జిరాక్సు కాపీలు తీసుకుని ఆరవల్లి వెళ్ళు తుండగా తణుకు మార్గమధ్యలో నా ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్సు పడిపోయినవి. చుట్టు ప్రక్కల ఎంత వెదకినా దొరకలేదు. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.
వెలగల వెంకట ధనలక్ష్మీ
భర్త: శివరామకృష్ణరెడ్డి,
డో.నెం.2-27/ఎ, కోలపువారి వీధి,
ఆరవల్లి, అత్తిలి మండలం, ప॥గో॥జిల్లా.

డాక్యుమెంట్స్ పోయినవి
వైట్ల సుధీప్ అను నేను అత్తిలి మండలం, అత్తిలిలో డో.నెం.16-91/1లో నివసిస్తున్నాను. ది.10-9-24న తణుకులో రిజిష్టర్డు పార్టీషన్ డీడ్ నెం.6384/2022 జిరాక్సు కాపీలు తీయించుకుని తణుకు నుండి అత్తిలి వెళ్ళుచుండగా నా ఒరిజినల్ పార్టీషన్ డీడ్ డాక్యుమెంట్స్ తణుకు మార్గమధ్యలో పడిపోయినవి. చుట్టు ప్రక్కల ఎంత వెదకిననూ దొరకలేదు. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.
వైట్ల సుదీప్
తండ్రి: కనక వెంకట అప్పారావు,
డో.నెం.16-91/1, సబ్‌రిజిష్టర్ కార్యాలయం వద్ద,
అత్తిలి, అత్తిలి మండలం, ప॥గో॥జిల్లా.

In The Court Of The Additional Senior Civil Judge, Eluru
E.P.No.11/2024 in O.S.No.259/2026
Between:
Korada Jagan Mohana Rao ...Petitioner /D.H.R
P.V.V.S.Manikyala Rao (Died) & 3 Others ...Respondents /J.D.R's
J.D.R-2: Peddireddy Padmavathi, W/o. Late P.V.V.S. Manikyala Rao, R/o. D.No.4-9/1, Near Ramalakshmi Brick Company, Pedavegi Village & Mandal, W.G.Dist.
J.D.R-3: Peddireddy Rajya Lakshmi, D/o. Late P.V.V.S. Manikyala Rao, R/o. D.No.4-9/1, Near Ramalakshmi Brick Company, Pedavegi Village & Mandal, W.G.Dist.
J.D.R-4: Peddireddy Deepika, D/o. Late P.V.V.S. Manikyala Rao, R/o. D.No.4-9/1, Near Ramalakshmi Brick Company, Pedavegi Village & Mandal, W.G.Dist.
పై నెంబరు ఇ.పి.లో 2 టు 4 జె.డి.ఆర్స్ అయిన మీకు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు నోటీసులు పంపించిననూ మీకు అమలు జరగని కారణంచే ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు అమలుకు ఉత్తర్వులు ఇచ్చినారు. సదరు ఇపి వాయిదా తేదీ ది.15-10-2024న ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు గాని మీ అడ్వకేట్ గారి ద్వారా గారి హాజరు కాగలరు. లేని ఎడల ఇ.పి. మీ పరోక్షముగా విచారణ జరపబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎం.కేదారి,
డి.వి.అప్పారావు, అడ్వకేట్స్,
ఏలూరు, ఆర్.ఆర్.పేట, ఏలూరు.
18-9-24. సెల్: 94401 11127

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.13 of 2022 in O.S.No.22 of 2021
బిట్వీన్:
ఇందుర్తి అనురాధ ...పిటీషనరు /డి. హెచ్.ఆర్ /వాది
అండ్
పిట్టల రాజేష్ ...రెస్పాండెంటు /జె.డి.ఆర్ /ప్రతివాది
పై నెంబరు వారంటు గ్రంథములో డి.హెచ్.ఆర్.కి రావలసిన డిక్రీ బాకీని, ఖర్చులు మరియు వడ్డీతో సహా రాబట్టుకొనుటకు గాను, జె.డి.ఆర్. స్వాధీనంలో గల ఇ.పి. షెడ్యూలు స్థిరాస్థిని ది.03-10-2024 సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పై కోర్టు వారి ఎదుట వేలం పాట వేయబడును. కావున వేలం పాటలో పాల్గొనదలచిన వారు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులు తెలుసుకొని వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.
షెడ్యూలు ఆస్థి వివరం
పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు మండలం, మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో చేరిన మొగల్తూరు రెవిన్యూ విలేజి, మొగల్తూరు గ్రామ పంచాయితీ ఏరియాలోని రి.స.నెం.722/1ఎ/1, ప్రస్తుత రి.స.నెం.722/1లో ఆర్.సి.సి. రూఫ్ బిల్డింగు, డో.నెం.4-189 రులో చ॥గ॥220 గల స్థలమున్ను అందులోని బిల్డింగుకు హద్దులు:
తూర్పు: గ్రామ పంచాయతీ రోడ్డు 37-03 అ॥లు. పడమర: గెద్దాడ హనుమంతు రావు గారి ఆస్థి 31-09 అడుగులు. దక్షిణం: శ్రీరామాలయం భూమి. ఉత్తరం: జంపన శ్రీనివాస రాజు భూమి 30-00 అ॥లు.
ఈ హద్దుల మధ్య చ॥గ॥220 గల స్థలమున్ను అందులోని ఆర్.సి.సి.రూఫ్ బిల్డింగున్ను సదరు బిల్డింగు అంటియున్న యావత్తు గృహోపకరణములతో సహా వేలం కావలసియున్నది.
డి. హెచ్.ఆర్. విలువ : రూ.15,00,000/-
అమీనా విలువ : రూ.22,00,000/-
శ్రీమతి కుంచె దుర్గా భవాని
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం
18-9-24. సెల్: 9063037773